TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 199   ఆదివారం 23-03-2025   పేజీలు : 06   వేల : 05/-

# వచ్చే నెలలో హైదరాబాద్‌లో పునర్విభజనపై రెండో సదస్సు

**పునర్విభజనతో నష్టపోయే రాష్ట్రాల హక్కుల రక్షణకు భారీ బహిరంగ సభ**

**జాతీయ స్థాయిలో సమన్వయం..కార్యాచరణ అమలుకు ఢిల్లీలో కార్యాలయం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు సదస్సులో ఆమోదం**




**చెన్నై:** నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలతో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల హక్కులను కాపాడుకునే క్రమంలో రెండో సదస్సుకు హైదరాబాద్‌లో వేదికకానుంది. పునర్విభజనకు సంబంధించి చెన్నైలో శనివారం నిర్వహించిన సదస్సు ఈ మేరకు తీర్మానించింది. సదస్సులో ప్రసంగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునర్విభజనతో నష్టపోనున్న రాష్ట్రాల ప్రజల అభిమతానికి అనుగుణంగా రెండో సదస్సును హైదరాబాద్‌లో నిర్వహిస్తామని, అనంతరం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇందుకు సదస్సులో పాల్గొన్నవారంతా మద్దతు తెలపడంతో పునర్విభజన సదస్సు, సభకు హైదరాబాద్ వేదికగా మారనుంది. పునర్విభజనపై దక్షిణాదితో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల గళాన్ని బలంగా వినిపించేందుకు ఆయా రాష్ట్రాల్లోని అన్ని పార్టీల ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలోనే అన్ని రాజకీయ పరమైన నిర్ణయాలు జరుగుతాయని, ఈ నేపథ్యంలో అక్కడ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ..పరస్పరం సమన్వయం చేసుకుంటూ.. భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఎంపీలతో కూడిన కమిటీ పని చేయాలని, ఇందుకు ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఇందుకు సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రులు, నాయకులు అంగీకరించడంతో ఢిల్లీలో ఆ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా రేవంత్ రెడ్డి..నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి చరిత్ర.. వర్తమాన పరిస్థితులతో పాటు జనాభా దామాషా, ప్రొరేట్ ప్రకారం పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు, పంజాబ్, ఒడిశా నష్టపోయే తీరును సీఎం రేవంత్ రెడ్డి వివరించడంతో సదస్సులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ శ్రద్ధగా విన్నారు. నియోజకవర్గాల పునర్విభజన చేపట్టినా లోక్‌సభ సీట్లు పెంచకుండా శాసనసభ సీట్లు పెంచుకునే అవకాశం రాష్ట్రాలకు కల్పించాలని సీఎం సూచించడం ప్రతి ఒక్కరిని ఆకర్షించింది. మహిళలకు 33 శాతం సీట్లు, ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపుపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సూచనలు చాలా అర్ధవంతంగా ఉన్నాయని సదస్సులో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు.

**నియోజకవర్గాల పునర్విభజనపై చెన్నై సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం...**నియోజకవర్గాల పునర్విభజనపై మనందరిని ఏకతాటిపై తెచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి గౌరవ స్టాలిన్‌కు ప్రత్యేక అభినందనలు... పునర్విభజనపై మనం అభిప్రాయాలను పంచుకోవాలి.. ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నా.. ఇక్కడ నా అభిప్రాయాలను మీతో పంచుకుంటున్నా... ప్రస్తుతం దేశం పెద్ద సవాల్‌ను ఎదుర్కొంటోంది.. బీజేపీ జనాభా జరిమానాల విధానాన్ని కొనసాగిస్తోంది..1971లో జనాభాను నియంత్రించాలని దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని అమలు చేస్తే ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విఫలమయ్యాయి..దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి.. జీడీపీ, తలసరి ఆదాయం, వేగంగా ఉద్యోగాల కల్పన, మెరుగైన మౌలిక వసతుల కల్పన, సుపరిపాలన, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో మంచి ప్రగతి సాధించాయి..దేశ ఖజానాకు మనం పెద్ద మొత్తంలో నిధులు ఇస్తూ తక్కువ మొత్తాన్ని పొందుతున్నాం...తమిళనాడు పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే 29 పైసలే వెనక్కి వస్తుంటే... ఉత్తర ప్రదేశ్‌కు రూపాయికి రెండు రూపాయల 73 పైసలు వెనక్కి వెళుతున్నాయి... బీహార్ రూపాయి చెల్లిస్తే 9 రూపాయల 22 పైసలు వెనక్కి తీసుకుంటుంటే కర్ణాటకకు కేవలం 14 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62పైసలు మాత్రమే వెనక్కి వస్తున్నాయి. అదే సమయంలో మధ్య ప్రదేశ్ రూపాయి పన్ను రూపంలో కేంద్రానికి ఇస్తే వెనక్కి రూ.2.79 పైసలు వెళుతున్నాయి..దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం కేటాయింపులు.. పన్ను చెల్లింపులు క్రమంగా తగ్గిస్తోంది.. చివరకు జాతీయ ఆరోగ్య మిషన్ కేటాయింపుల్లోనూ ఉత్తరాది రాష్ట్రాలకే 60 నుంచి 65 శాతం నిధులు దక్కుతున్నాయి..మనది ఒకే దేశం.. మనం దానిని గౌరవిస్తాం.. కానీ ఈ పునర్విభజనను మనం అంగీకరించం.. ఎందుకంటే ఇది దక్షిణాది రాష్ట్రాల రాజకీయ కుదింపు.. మంచి ప్రగతి సాధిస్తున్న రాష్ట్రాలను ఈ ప్రక్రియ శిక్షిస్తోంది. ఈ అసమగ్రమైన పునర్విభజన ప్రక్రియ 2లో

## రాష్ట్ర వ్యాప్తంగా దావత్ ఏ ఇఫ్తార్ ఘనంగా నిర్వహించండి



**హైదరాబాద్, మార్చి 22 :** దావత్ ఏ ఇఫ్తార్ ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. శనివారం అసెంబ్లీ సమావేశ మందిరంలో ఇఫ్తార్ విందు, రంజాన్ పండుగ ఏర్పాట్లను ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి సమీక్షించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు ఎలాంటి నిధుల కొరత లేదు అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆహారంలో నాణ్యత, ప్రోటోకాల్, సౌకర్యాల కల్పనలో అధికారులు ఎలాంటి రాజీ పడాల్సిన అవసరం లేదని డిప్యూటీ సీఎం తెలిపారు. ఏర్పాట్లలో అధికారులు ఏమాత్రం అశ్రద్ధ వహించరాదని, చిన్న పొరపాటుకు అవకాశం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం తెలిపారు. లా అండ్ ఆర్డర్, ఎలక్ట్రిసిటీ, మంచినీరు వాటి అంశాలు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కోరారు. ఏర్పాట్లలో ఎలాంటి అనుమానాలు, ఇబ్బందులు ఎదురైనా అధికారులు మొహమాట పడకుండా జిల్లా ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ లేదా తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ఏర్పాట్లకి సంబంధించి రోజువారి సమీక్షను ప్రభుత్వ సలహాదారు, ఏర్పాట్ల కమిటీ వైస్ చైర్మన్ షబ్బీర్ అలీ రోజువారి సమీక్ష చేస్తారని తెలిపారు.సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులకు ఏలాంటి అసౌకర్యం లేకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, దావత్ ఏ ఇఫ్తార్ కు కూడా ఘనంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ మాట్లాడుతూ మా ప్రభుత్వం దావత్ ఏ ఇఫ్తార్ ను ఘనంగా నిర్వహిస్తుందని అన్నారు.సమావేశంలో అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## నమీబియాకు తొలి మహిళా అధ్యక్షురాలుగా నంది

**విండ్‌హెూక్ :** ఆఫ్రికాలోని ఎడారి దేశం నమీబియాకు తొలి మహిళా అధ్యక్షురాలుగా నంది నదైత్వాహ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే తన ప్రాధాన్యత అని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కనీసం ఐదు లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇందుకోసం కనీసం ఐదు బిలియన్ డాలర్లు అవసరమవుతాయని తెలిపారు. వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, సృజనాత్మకత, క్రీడా రంగంలో ఈ ఉద్యోగాలు సృష్టించబడతాయని చెప్పారు. నవంబర్ ఎన్నికల్లో నంది పార్టీ సౌత్‌వెస్ట్ ఆఫ్రికా పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌డబ్ల్యూఎపిఒ) 58 శాతం ఓట్లతో విజయం సాధించింది. దీంతో నంగోలో మ్బుంబా అధ్యక్షుడిగా, నంది ఉపాధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాదితో నమీబియాకు స్వాతంత్ర్యం వచ్చి 35 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో మహిళను అధ్యక్షురాలుగా నియమించాలని ఎస్‌డబ్ల్యూఎపిఒ నిర్ణయం తీసుకుంది. దీంతో నంది నదైత్వాహ అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. నమీబియా ప్రపంచంలోనే ప్రముఖ యురేనియం ఉత్పత్తిదారుగా ఉంది. వజ్రాలు, సహజవాయువు, చమురు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. 1990లో దక్షిణాఫ్రికా నుంచి స్వాతంత్ర్యం పొందింది.

## ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం



**జకర్తా :** ఇండోనేషియాలోని లెవొటబి లకి అగ్నిపర్వతం శుక్రవారం మూడుసార్లు బద్దలైంది. దీంతో దాదాపు 8వేల మీటర్ల (26,200 అడుగులు) ఎత్తున బూడిద చిమ్మింది. పరిస్థితి తీవ్రతను గమనించిన అధికారులు వెంటనే అగ్నిపర్వతం చుట్టుపక్కల 8కిలోమీటర్ల మేరా ప్రమాదకర ప్రాంతంగా ప్రకటించి తగు చర్యలు తీసుకున్నారు. తూర్పు నుసా తెంగ్గర ప్రావిన్స్‌లో ఫ్లోర్స్‌దీవిలో గల ఈ అగ్నిపర్వతం గత వారం రోజులుగా క్రియాశీలంగా వుంది. గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం తెల్లవారు జాములోగా మూడుసార్లు బద్దలైంది. ఈ కారణంగా ఆస్ట్రేలియా, బాలి మధ్య పలు విమానాలు రద్దయ్యాయి. బాలికి వచ్చే పలు అంతర్జాతీయ, దేశీయ విమానాలు ఆలస్యమవుతున్నాయి. గత నవంబరులో కూడా ఈ అగ్నిపర్వతం ఇలాగే లావాను చిమ్మింది ఆ ప్రమాదంలో 9మంది మరణించగా, పలువురు గాయపడ్డారు.

## విద్యా శాఖను రద్దు చేసిన ట్రంప్

**వాషింగ్టన్ :** విద్యా శాఖను రద్దు చేస్తున్న ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం సంతకాలు చేశారు. తద్వారా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ విద్యా శాఖను మూసివేసి, రాష్ట్రాలకు, స్థానిక కమ్యూనిటీలకు తిరిగి అధికారాలను అప్పగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మహన్ ఈ సందర్భంగా చెప్పారు. చట్టం అనుమతించిన మేరా అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మొత్తంగా ఒక శాఖను రద్దు చేయడమంటే ఆషామాషీ వ్యవహారం కాదని, దీనికి కాంగ్రెస్ అనుమతి కావాల్సి వుంటుందని ఆమె పేర్కొన్నారు. జనవరిలో ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళలోనే విద్యా శాఖ సిబ్బందిని సగానికి సగం తగ్గించేశారు. విద్యా శాఖ కార్యకలాపాలను కూడా ప్రక్షాళన చేశారు. డజన్ల సంఖ్యలో కాంట్రాక్టులను ట్రంప్ సలహాదారు మస్క్ రద్దు చేశారు. అవన్నీ వృధా ఖర్చులని వ్యాఖ్యానించారు. 1979లో ఏర్పడిన ఈ విద్యా శాఖ ప్రధానంగా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన విద్యార్థులకు సాయపడేందుకు, విద్యార్థులకు రుణాలు అందించే కార్యక్రమాలను చూస్తుంది. కాలేజీలు, పాఠశాలలకు ఫెడరల్ ప్రభుత్వం నుండి అందే నిధులే ఇక్కడ కీలక పాత్ర పోషిస్తున్నాయి. క్లిష్టమైన జాతి సిద్ధాంతాలు, లింగ మార్పిడి, ఇతర అనుచితమైన వర్ణ, లైంగిక, రాజకీయ వైఖరులను ప్రోత్సహించే ఈ కాలేజీలు, స్కూళ్ళకు ఇక నిధులు అందించరాదని ట్రంప్ ప్రతిన చేశారు. కాగా మన పిల్లలను దోచుకుంటన్నారని హక్కుల కార్యకర్తలు, డెమోక్రాట్ సభ్యులు తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ ఈ చర్యను పూర్తిగా అమలుపరచలేరని, వంద సీట్లు గల సెనెట్‌లో కనీసం 60మంది మద్దతు అవసరమవుతుందని విమర్శకులు పేర్కొంటున్నారు.

# వచ్చే నెలలో హైదరాబాద్‌లో పునర్విభజనపై రెండో సదస్సు




చేపట్టకుండా మనం బీజేపీని అడ్డుకోవాలి..
నా మొదటి పాయింట్... సీట్లు పెంచొద్దు.. ఉన్న సీట్లతోనే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి... 1976లో ఇందిరా గాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అలానే పునర్విభజన చేపట్టింది. లేకుంటే రాష్ట్రాల మధ్య రాజకీయ తేడాలు (అసమతౌల్యాలు) వచ్చేవి2001లో ప్రధానమంత్రి వాజ్‌పేయిా నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించింది. లోక్‌సభ సీట్లను అదే సంఖ్యలో ఉంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అదే విధంగా చేయగలరా? నా రెండో పాయింట్... జనాభా దామాషా ప్రాతిపదిక పునర్విభజను దక్షిణాది వ్యతిరేకిస్తోంది... బీజేపీ ప్రతిపాదిస్తున్న జనాభా దామాషా పద్దతిలో పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలైన మనం రాజకీయ గళం కోల్పోతాం. మనల్ని ఉత్తరాది ద్వితీయ శ్రేణి పౌరులుగా తగ్గించివేస్తుంది. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపడితే ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చలాయిస్తాయని ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. ఏ పరిస్థితుల్లోనూ మనం దీనికి అంగీకరించకూడదు.

బీజేపీ అనుసరిస్తున్న ఈ విధానానికి వ్యతిరేకంగా దక్షిణాది ప్రజలు, పార్టీలు, నాయకులు ఏకం కావాలి...మూడో పాయింట్... ప్రొరేటా విధానాన్ని అంగీకరించలేం... ప్రొరేటా విధానం కూడా దక్షిణాదికి నష్టమే కలిగిస్తుంది.. ప్రొరేటా ప్రక్రియ కూడా రాజకీయ అంతరాలను పెంచుతుంది. ప్రొరేటా విధానాన్ని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్ర ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది.. ఒక్క సీటు కూడా తేడాను చూపుతుంది..ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మన దేశంలో ఉంది. కాబట్టి ప్రొరేటా విధానం కూడా దక్షిణాది రాజకీయ ప్రయోజనాలకు భంగం కలిగిస్తుంది.మరి మనం అంగీకరించే ఆప్షన్లు ఏమిటంటే... నా సింపుల్ విశ్లేషణ ఏమంటే... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయిా విధానాన్ని పాటించడమే... మరో 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్లలో ఎటువంటి మార్పు తీసుకురావద్దుసీట్ల సంఖ్యలో మార్పు లేకుండా పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి..పునర్విభజనకు రాష్ట్రాన్ని యూనిట్ తీసుకొని చేయాలి..రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా పునర్విభజన చేపట్టాలి రాష్ట్రాల్లోని నగరాలు, గ్రామాల్లోని జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్ల హద్దులను మార్పు చేయాలి..తాజా జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ సీట్ల సంఖ్య పెంచాలి...ప్రతి రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి..లోక్ సభ స్థానాల పెంపును మరో 25 ఏళ్లపాటు వాయిదా వేయాలి..నేను తెలంగాణలోని మల్కాజిగిరి ఎంపీగా చేశాను.. అది ప్రపంచంలోనే అతి పెద్ద నియోజకవర్గం.. అక్కడ మొత్తం జనాభా 45 లక్షలైతే ఓటర్లు 32 లక్షలు.. కాబట్టి నేను ఈ సమస్యను పూర్తిగా అర్థం చేసుకోగలను..పార్లమెంట్ దేశానికి విధానపరమైన శాసనాలను రూపొందిస్తుందే తప్ప ప్రజలకు అవసరమైన చిన్న చిన్న సమస్యలపై నిర్ణయాలు చేయదు. ప్రజలకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలను స్థానిక సంస్థలు, రాష్ట్రాలు, శాసనసభ నియోజకవర్గాల పరిధిలోనే పరిష్కారమవుతాయి. నేను చేసే తుది డిమాండ్.. చూపించే పరిష్కారం... జనాభా నియంత్రణకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి... దేశ నిర్మాణంలో 1975 నుంచి 2025 వరకు 50 ఏళ్ల పాటు మనం అందించిన సేవలకు మనల్ని అభినందించాలి. మనకు వెనక్కి కొంత చెల్లించాలి..జనాభా దామాషా ప్రాతిపదికన చేసే పునర్విభజన చేపట్టొద్దని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి.. లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశం ఇవ్వాలి..మంచి ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించేలా చేయాలి..ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీ పునర్విభజన ప్రక్రియ చేపట్టాలనుకుంటే నా ప్రధాన డిమాండ్ ఇదే...543 సీట్లు ఉన్న లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130.. ఇది మొత్తం సీట్లలో 24 శాతం.. పునర్విభజన తర్వాత ఏర్పడే నూతన లోక్‌సభలో మాకు 33 శాతం సీట్లు ఇవ్వాలనేది దక్షిణాది రాష్ట్రాలుగా మా డిమాండ్ బీజేపీ 50 శాతం సీట్లను పెంచాలనుకుంటే అలా పెరిగే 272 సీట్లతో మొత్తం లోక్ సభ సీట్ల సంఖ్య 815 అవుతుంది. ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు 33 శాతం అంటే 272 సీట్లు ఇవ్వాలి...ఈ సీట్లను దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ఇప్పుడున్న ప్రొరేటా ప్రాతిపదికన పంచవచ్చు... దేశంలో మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం తమ అభిమతం మేరకు పంచవచ్చు.. అనుకున్న దానికంటే దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు మన విభేదాలను విస్మరించి పునర్విభజనలో మన వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేస్తున్నా... పునర్విభజన ప్రక్రియపై మా రాష్ట్ర శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తాం... మేం మా రాష్ట్రంలో ఎలా చేస్తున్నామో మీ మీ రాష్ట్రాల్లోనూ అలానే చేయాలని సహచర ముఖ్యమంత్రులు, ఇతర నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నా.. దక్షిణ భారతదేశ పౌరుల గళానని బలంగా, ఐక్యంగా మొత్తం భారత దేశానికి వినిపిద్దాం... పునర్విభజన ప్రక్రియపై తర్వాత సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహిస్తాను.. మన పోరాటాన్ని ఏవిధంగా ముందుకు తీసుకెళదామనే విషయాన్ని ఆ సమావేశంలో చర్చిద్దాం.... ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు ఒక భారీ బహిరంగ సభను నేను ఏర్పాటు చేస్తాను..దక్షిణ భారతదేశానికి చెందిన అన్నతమ్ముళ్లు.. అక్కా చెల్లెళ్లంతా కలిసి వచ్చి.. మన హక్కుల రక్షణకు కలిసి రావాలని నేను విజ్ఞప్తి చేస్తున్నా.

## ఇందిరా మహిళ శక్తి పథకంలో మహిళ వికలాంగులకు వాటా ఎంత...?

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహిళా వికలాంగుల సాధికారత-సంక్షేమం అనే అంశంపై రాష్ట్ర సదస్సు సి సాయమ్మ అధ్యక్షతన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది.మహిళా వికలాంగుల సాధికారత, సంక్షేమ%శీ% పై తీర్మాణాన్ని రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి వరమ్మ ప్రవేశపెట్టినారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి జ్యోతి మాట్లాడుతూ మహిళా వికలాంగుల సాధికారత, విద్యా, స్వయం ఉపాధి, ఆరోగ్యం, భద్రత,రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సామాజిక, రాజకీయ, ఆర్థిక రంఘాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించే లక్ష్యంతో 1975 నుంచి ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నదని అన్నారు.మహిళలు, మహిళా వికలాంగులపై వేధింపులు, లైంగిక దాడులు పెరుగుతున్నయి.మహిళల రక్షణ కోసం రాజ్యాంగంలో ఉన్న అంశాలను అమలు కావడం లేదు. పితృస్వామ్య సంస్కృతి ప్రభావంతో, మహిళలు సాధారణంగా లింగ వివక్షను ఎదుర్కొంటున్నారు . వైకల్యం ఉన్న మహిళలు తమ లింగం కారణంగా వివక్షను అనుభవించడమే కాకుండా, వారి వైకల్యం కారణంగా కూడా వివక్షకు గురవుతారు. వైకల్యం లేని వ్యక్తులతో పోలిస్తే, వైకల్యం ఉన్న మహిళలు పేదరికం, విద్య మరియు ఉపాధిలో పరిమిత అవకాశాలు మరియు పేద ఆరోగ్య పరిస్థితులతో సహా వివక్షత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. వైకల్యం ఉన్న పురుషులతో పోలిస్తే వైకల్యం ఉన్న మహిళలు కూడా హీనమైన జీవితాలకు గురవుతున్నారు. వైకల్యం ఉన్న స్త్రీలు జీవితంలోని వివిధ సందర్భాలలో వైకల్యం ఉన్న పురుషుల కంటే ఎక్కువగా వివక్షకు మరియు దుర్వినియోగానికి గురవుతున్నారు. వైకల్యం కారణంగా మహిళ వికలాంగులు వివాహం చేసుకోవడంతో పాటు పిల్లలను కని పెంచడంలో అవకాశాలను కోల్పోతున్నారు. మన సమాజంలో వైకల్యం ఉన్న మహిళల పట్ల వివక్షత మరియు తక్కువ స్థాయి పరిస్థితులు ఉన్నప్పటికీ, జనాభా సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మహిళ వికలాంగుల జీవన నాణ్యత ఇప్పటికీ వైకల్యం ఉన్న పురుషుల కంటే తక్కువగా ఉంది. 37% వైకల్యం ఉన్న పురుషులు ప్రాథమిక పాఠశాల నుండి పట్టభద్రులు కాలేదు. వైకల్యం ఉన్న మహిళలకు ఈ శాతం దాదాపు రెట్టింపుగా ఉంది. 67.3% వైకల్యం ఉన్న మహిళలకు ప్రాథమిక డిప్లొమా లేదని తేలింది. ఉపాధిలో కూడా అంతరం ఉంది. వైకల్యం ఉన్న పురుషుల ఉపాధి రేటు 50%కి దగ్గరగా ఉంది కానీ వైకల్యం ఉన్న మహిళలకు ఇది 25.48%కి పడిపోయింది. తక్కువ జీవన నాణ్యత మరియు మన సమాజంలో వైకల్యం ఉన్న మహిళలు ఎదుర్కొంటున్న ప్రమాదాలు ఈ పరిస్థితులను అన్వేషించడానికి మరియు ఈ జనాభాకు పరిష్కారాలను అందించడానికి కృషి అవసరమని సూచిస్తున్నాయి. సామాజిక సహాయం, వైకల్య మద్దతు, మహిళల ఆరోగ్య అవసరాలపై ప్రత్యేక దృష్టితో సార్వత్రిక ఆరోగ్య కవరేజ్ కల్పించడం ద్వారా దాదాపు 38 మిలియన్ల మంది తల్లులకు ప్రసూతి ప్రయోజనాలు, 100 మిలియన్ల మంది మహిళలు, పిల్లలు మరియు కౌమారదశలో ఉన్న బాలికల పోషకాహార, ఆరోగ్యం మరియు పెరుగుదల అవసరాలను పోషన్ ట్రాకర్ ద్వారా అందించాలి.నేటి సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ప్రపంచంలో, సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా మరియు బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడానికి సమతుల్య నియంత్రణ అవసరం, ముఖ్యంగా సామాజిక రక్షణ వ్యవస్థల కోసం ఇ-గవర్నెన్స్‌ను ఉపయోగించుకోవడం ద్వారా మహిళ వికలాంగులకు మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు అవకాశం ఉందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో సంక్షేమ పథకాలకు నిధుల కోత విదిస్తున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని అన్నారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మన్ పి ఉమర్ ఖాన్, వీఆర్‌సీ మాజీ డైరెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మహిళలకు చదువు కునే అవకాశాలు లేకపోవడం వలన వెనకబడుతున్నారని అన్నారు. చదువు ఉంటేనే సమాజంలో గుర్తింపు గౌరవం వస్తుందని అన్నారు. మహిళలకు రాజకీయ రిజర్వేషన్స్ అమలు చేయడంలో పాలక పార్టీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. మహిళా వికలాంగులను ప్రత్యేక%శీ%గా చూడాలని అన్నారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.కే.సలీమ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ అరుణ జ్యోతి మాట్లాడుతూ సమాజంలో సామజిక, ఆర్థిక, రాజకీయ అంశాల్లో నిర్ణయాలు చేసే స్థాయికి ఎదగాలని అన్నారు. మహిళలు వంటింటికే పరిమితం చేయాలని పాలకులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నిరోధక కమిటీలను వేయాలని డిమాండ్ చేశారు.సావిత్రి బాయి పూలె ఇచ్చిన స్ఫూర్తితో మహిళలు చదువుకునేందుకు ముందుకు రావాలని అన్నారు ఎన్.పీ.ఆర్.డీ.రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, యం అడివయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు నాలుగు లక్షల మంది మహిళా వికలాంగులున్నారు ఐక్య రాజ్య సమితి హక్కుల ఒప్పందం పత్రంలోని ఆర్టికల్ 3,6లలో మహిళా వికలాంగుల హక్కులు పొందుపరచినా అమలు కావటం లేధు మహిళా వికలాంగుల్లో వివాహం కానీ వారి సంఖ్య సాధారణ మహిళలతో పోల్చితే నాలుగు రెట్లు అధికంగా ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతి అనే సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైనది.మహిళా మానసిక వికలాంగులు 70 శాతం లైంగిక దూరక్రమణకు గురవుతున్నారన్నారు గృహహింస చట్టంలోని సెక్షన్ 3(బి),(డి)మహిళా వికలాంగులు వినియోగించుకోవడం లేదు. వారి హక్కులు, రక్షణ కోసం ఎన్‌పీఆర్‌డీ నిరంతరం పోరాడుతుంది మహిళా వికలాంగులపై వేధింపులు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలి మహిళా వికలాంగులను వివాహం చేసుకున్న వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని కోరారు. పెండ్లి కానీ మహిళా వికలాంగులకు ప్రభుత్వమే హోమ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తుంది. ఇందిరా మహిళ శక్తి పథకం అమలులో భాగంగా కోటి మంది మహిళలకు అందిస్తున్న పథకాల్లో 5శాతం మహిళ వికలాంగులకు కేటాయించాలి. రాజీవ్ యువ వికాసం పథకంలో నిరుద్యోగ మహిళ వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## హక్కుల కోసం తెలంగాణ నుంచి ఉద్యమ పొలికేక

**హైదరాబాద్ :** హక్కుల కోసం తెలంగాణ నుంచే ఉద్యమ పొలికేక మొదలైందని, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా బీసీ హక్కుల కోసం జరగబోయే ఉద్యమం కూడా తెలంగాణనుంచే మొదలవుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బహుజనుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమించాల్సి అవసరం ఉందని, దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమంలో తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ మొదటి వరుసలో ఉంటాయని అని ప్రకటించారు. శనివారం నాడు సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ... “బీసీ బిల్లులు ఆమోదం పొందితే మొక్కు చెల్లించుకుంటానని గతంలో ప్రకటన చేశాను. చట్టసభలు బిల్లలు ఆమోదించిన నేపథ్యంలో కొమురవెల్లిలో మొక్కు చెల్లించుకున్నాను. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి వేర్వేరు బిల్లును పెట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులు ఆమోదం పొందిన రీత్యా ప్రభుత్వం తదుపరి అడుగు వేయాలి. చట్టాలను కేంద్రం నుంచి ఆమోదించుకొని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలి. రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బిల్లులను కేంద్రం ఆమోదించడానికి ప్రభుత్వం ప్రయత్నించాలి. ఆమోదించిన చట్టాలను ఎవరైనా కోర్టుల్లో సవాలు చేస్తే ప్రభుత్వం గట్టిగా కొట్లాడాలి” అని కవిత పేర్కొన్నారు.దేశంలో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పిస్తున్న రాష్ట్రాలు తెలంగాణతో సహా దాదాపు 10 ఉన్నాయని, ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లు అమలైన తర్వాత తెలంగాణలో 54 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయన్న విషయాన్ని ప్రభుత్వం గమనించాలని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలిగిపోయిన నేపథ్యంలో కోర్టుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిగా వాదించాలని, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే బీసీలకు అన్యాయం జరుగుతుందని తొలి నుంచి వాదిస్తున్నాం అని తెలిపారు.అసెంబ్లీ అవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమాజం పరిణితి చెందుతున్నా కొద్ది విస్మరించిన వర్గాలు ఒక్క చోటుకు రావాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగ హక్కుల కోసం పోరాటం చేయాలని అన్నారు. బీసీ బిల్లులు అంటే.. ఆ ఒక్క వర్గం లొల్లి కాదు%ౌ% ఇది అందరి లొల్లి అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.కొమురవెల్లి మలన్నకు ప్రభుత్వం తరపున కేసీఆర్ 130 ఎకరాల మాన్యం భూమిని అందించారని, కేసీఆర్ హయాంలో కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. కొమురవెల్లి అభివృద్ధి కోసం బీఆర్ఎస్ హయాంలో చేసిన ఖర్చు రూ 50 కోట్లు అని, తెలంగాణ రాష్ట్రానికి వరప్రదాయని అయిన ఒక రిజర్వాయర్ కు మలన్న సాగర్ అని పేరు పెట్టుకోవడం జరిగింది అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.మరోవైపు, మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి కుట్ర చేశాయని, ఆ రెండు ప్రాజెక్టులు కలిసి మేడిగడ్డపై దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ముఖ్యంగా బ్యారేజీకి పర్రెపట్టిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించడం, ఆ మరుసటి నాడే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్డీఎస్ఏ ను పంపించడం వంటివి జరిగాయని గుర్తు చేశారు. మరి ఎస్ఎల్బీసీ టన్నల్ ప్రమాదం జరిగి నెల రోజులు గడుస్తున్నా... ఎన్డీఎస్ఏ వాళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న కుట్రను ప్రజలు గమనించాలని కోరారు.కాళేశ్వరం నీళ్లు వినియోగించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో పోలాలను ఎండబెడుతూ రైతుల నోట్లల్లో మట్టికొడుతున్నదని ధ్వజమెత్తారు. లక్షాలది ఎకరాలు ఎండిపోతున్నా సిగ్గులేకుండా కాంగ్రెస్ నాయకులు చూస్తూ కూర్చున్నారు తప్పా రైతుల కష్టాలను చూడడం లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ కళ్లు తెరిపించడానికి రామగుండం నుంచి రగల్ జెండా ఎత్తుకొని కోరుకంటి చందర్ వచ్చారని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీపై పోరాటం చేస్తేనే తెలంగాణ వచ్చిందని, ఇప్పుడు కూడా కాంగ్రెస్ పై పిడికిలి ఎత్తి పోరాటం చేస్తేనే పోలాలకు నీళ్లు వస్తాయని అన్నారు. నీటి కోసం పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కృషి అభినందనీయమన్నారు. “ఒకప్పుడు తలాపున పారేటీ గోదారి... మన బతుకులు ఎడాది అని పాడుకున్న తెలంగాణను కేసీఆర్ గారు గోదావరి నీటితో చెరువును నింపి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారు. ఎండకాలంలో కూడా చెరువులు మత్తడి దుంకేలా గోదావరి నీటిని కేసీఆర్ గారు సద్వినియోగం చేశారు” అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం వల్లనే గోదావరి జలాలను ప్రతీ ఇంటికి చేరాయని స్పష్టం చేశారు.కొమరవల్లిలో జరిగిన కార్యక్రమంలో జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, యునైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ బొల్ల శివశంకర్, యుపిఎఫ్ నేతలు ఆలకుంట్ల హరి, గోపు సదనందు, కొట్టాల యాదగిరి, గురిగి నరసింహ, ఎత్తరి మారయ్య, ఆర్వి మహేందర్, విజేందర్ సాగర్, ఏల్చల దత్తాత్రేయ, కీర్తలత గౌడ్, రాజమళ్ళ బాలకృష్ణ, హమాలీ శ్రీనివాస్, ఎమ్మెస్ నరహరి, కోల శ్రీనివాస్, డి నరేష్ కుమార్, అశోక్ కుమార్ యాదవ్, డి కుమారస్వామి, ప్రవీణ్ వంజరా, భాస్కర్ యాదవ్, లోడంగి గోవర్ధన్ యాదవ్, లింగం, కందాల మధు సాల్వా చారి, వీరన్న , రామకోటి శాలివాహన, సంతోష్ కుమార్ వంజరి పాల్గొన్నారు

# కబ్జా కోరులనుండి ప్రభుత్వ భూమిని కాపాడి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఇవ్వాలి



**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) మార్చ్ 22 :** కుత్బుల్లాపూర్ మండలంలో సర్వే నం. 251లో అక్రమ నిర్మాణాల గురించి కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు పత్రం సమరపించి సర్వే నం. 251 ప్రభుత్వ భూమి కాగా, ఇటీవలి కాలంలో రెండు గదులు నిర్మించబడినట్లు సమాచారం తెలుసుకొని ఈ నిర్మాణాలు జరగకుండా అపి వాటిపై చెర్యలు తీసుకోవాలి సర్వే నం. 251లో జరిగాయా లేక 250లోనివి అన్నది స్పష్టత లేకపోవడంతో, సంబంధిత అధికారులకు స్థల సర్వే చేసి, హద్దులు నిర్ణయించి,35 గుంటల ప్రభుత్వ భూమి కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు ఈ విషయంపై అధికారులు స్పందించి, సర్వే నం. 251లో సమగ్ర సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూమిని స్పష్టంగా గుర్తించనున్నట్లు హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో పనిచేస్తున్నందున, ప్రభుత్వ భూమిని కార్యాలయం కోసం ఉపయోగించాలని అకుల సతీష్, నల్ల జై శంకర్ గౌడ్, అరుణ్ రావు, చందు మరియు ఇతరులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు

# తెలంగాణపై కుట్రలు.. కేసీఆర్ షాకింగ్ కామెంట్స్



**సిద్దిపేట (మన వెలుగు) మార్చి 22 :** తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో అధికారం బీఆర్ఎస్‌దేనని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సింగిల్‌గా అధికారంలో వస్తామని ఉద్ఘాటించారు. బెల్లం ఉన్న దగ్గర ఈగలు వస్తాయని.. అలానే సిరిసంపదలు ఉన్న తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. గోదావరి కన్నీటి గోస పేరిట గోదావరిఖని నుంచి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెలే కోరుకంటి చందర్ మహా పాదయాత్ర చేపట్టారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ఇవాళ (శనివారం) కోరుకంటి చందర్ మహా పాదయాత్ర ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు.పాదయాత్ర చేసి వచ్చిన వారితో కేసీఆర్ సమావేశమయ్యారు .ఈ సందర్భంగా కేసీఆర్ కీలక కామెంట్స్ చేశారు. పదేళ్లు తమ హయాంలో తెలంగాణలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ఇప్పుడు సమస్యల వలయంలో తెలంగాణ చిక్కుకుందని చెప్పారు. ఆనాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మెడపై కత్తి పెట్టిన తెలంగాణ కోసం తాను ఎక్కడ వెనకడుగు వేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని కేసీఆర్ తెలిపారు.తెలంగాణకు ఆనాడు దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మోసం చేసిందని కేసీఆర్ విమర్శించారు. ఏపీలో కూటమి లేకుంటే సీఎం చంద్రబాబు గెలిచేవారు కాదని చెప్పారు. బలవంతంగా తెలంగాణను ఆంధ్రాలో కలిపారని మండిపడ్డారు. ఈ నేలపై ఎవరూ శాశ్వతం కాదని చెప్పారు. అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలని ఉద్ఘాటించారు. తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ నేతలు పోరాడాలని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. కానీ ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదని ధ్వజమెత్తారు. మేనిఫెస్టోలో పెట్టకపోయిన రైతుబంధు, కల్యాణ లక్ష్మీ పథకాలను ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని కేసీఆర్ ఉద్ఘాటించారు.

# గంజాయి అమ్ముతూ పట్టుబడిన యువకుడి అరెస్ట్




**ఇబ్రహింపట్నం (మన వెలుగు) మార్చి 22 :** మేడిపల్లి గ్రామా శివారులోని శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద జాతీయ రహదారి పై ఇబ్రహింపట్నం ఎస్సై అనిల్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ఒక యువకుడు నిజామబాద్ వైపు నుండి మెట్పల్లి వైపు ఒక మోటార్ సైకిల్ పై వస్తు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంటనే పోలీసులు అతన్ని వెంబడించి పట్టుకొని విచారించగా ఆ యువకుడు గంజాయి అమ్ముతున్నట్లు తేలింది. పోగుల అజయ్ (23) అనే యువకుడు కోరుట్ల పట్టణంలో వినాయక విగ్రహాలు తయారు చేసే షాపులో కూలీగా పనిచేస్తున్నాడు.అజయ్ మహారాష్ట్రలోని నాందేడ్ కు చెందిన మొహమ్మద్ అజార్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు వాటిని చిన్న చిన్న ప్యాకెట్ లు గా చేసి కోరుట్ల, మెట్పల్లి మరియు చుట్టుపక్కల గ్రామాలలో అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిపాడు.అజయ్ గతంలో కూడా కోరుట్ల పోలీస్ స్టేషన్ లో గంజాయి కేసు మరియు ఇతర రెండు కేసులలో జైలుకు వెళ్ళినట్లు అతను ఒప్పుకున్నాడు.అతని వద్ద నుండి 300 గ్రాముల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం,ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 15 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.నిందితుడిపై ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు మరియు ఈ కేసులో పరారిలో ఉన్న మరొక నిందితున్ని త్వరలోనే పట్టుకొని కోర్టులో హాజరు పరుస్తామని సిఐ. ఏ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# గాజా పై దాడులు ముమ్మరం చేసిన ఇజ్రాయిల్



గాజా పై ఇజ్రాయిల్ దాడులు ముమ్మరం చేసింది, హమాస్ వద్ద బందీలుగా ఉన్నవారిని రక్షించేందుకు, ఒకపక్క వైమానిక దాడులతో పాటు, సముద్ర మార్గం నుంచి, భూ మార్గం నుంచిఇజ్రాయిల్ ముప్పేట దాడికి దిగింది. పాలస్తీనా లో హమాస్ అధీనంలో ఉన్న మరిన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని సైన్యానికి కీలక ఆదేశాలు జారీ చేసింది.హమాస్ పై ఇజ్రాయిల్ మళ్లీ చేపట్టిన సైనిక చర్యకు అమెరికా అన్ని విధాలా మద్దతు ఇస్తోంది.హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయిల్ పౌరులను వెంటనే విడుదల చేయని పక్షంలో గాజాలోని మరిన్ని పట్టణాలను ఆక్రమించుకోవాలని ఇజ్రాయిల్ రక్షణ శాఖ మంత్రి ఇజ్రేల్ కట్జ్ సైన్యాన్నిఆదేశించారు. అక్కడి నుంచి పాలస్తీనియన్లను ఖాళీ చేయించి ఆ ప్రాంతాలను శాశ్వతంగా స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు.దాదాపు రెండు నెలల పాటు కాల్పుల విరమణ ముగియడం తో ఇజ్రాయిల్ త్రివిధ దళాలు ముమ్మరంగా చేపట్టిన ముప్పేట దాడితోకకావికలైన పాలస్తీనియన్లు ప్రాణాలు రక్షించు కొనేందుకు ఇతర ప్రాంతాలకు పారిపోతున్నారు. గాజా పై ఇజ్రాయిల్ మంగళవారం నాడు విమానాలద్వారా బాంబులవర్షం కురిపించడంతో 400 మందికి పైగా పాలస్తీనియన్లు చనిపోయారు. ఆ తర్వాత జరిగిన దాడిలో మరో 85 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ముగిసినప్పటి నుంచీ ఇప్పటివరకూ 592 మంది పాలస్తీనియన్లు మరణించారు.హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్ కు ఉందని, హమాస్ తమవద్ద బందీలుగా ఉన్న వారందరినీ స్వేచ్ఛగా విడిచి పెట్టి ఉంటే, ఇజ్రాయిల్ కాల్పుల విరమణను పొడిగించేదని, కానీ, హమాస్ అందుకు అంగీకరించకుండా వారు యుద్ధాన్నే కోరుకున్నారని అమెరికా నేషనల్ సెక్యూరిటీ సలహాదారు మైకి విల్ట్ జ్ పేర్కొన్నారు.

# ఆ రేసులో నేను లేను.. తేల్చిచెప్పేసిన బండి సంజయ్



**హైదరాబాద్ (మన వెలుగు) మార్చి 22 :** తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి ఎంపిక త్వరలోనే జరుగనుంది. ఈ పదవి కోసం పార్టీలోని ఆశావాహులు ఎదురుచూస్తున్న పరిస్థితి. ఆ పదవి తమకే రావాలని పలువురు సీనియర్ నేతలు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా... తెలంగాణ రాష్ట్ర నూతన బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్ అంటూ గత కొద్దిరోజులుగా ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో బీజేపీ అధ్యక్షుడి పదవిపై వస్తున్న వార్తలకు కేంద్రమంత్రి ఫుల్‌స్టాప్ పెట్టేశారు. 'నేను రాష్ట్ర అధ్యక్ష రేసులో లేను, నాకే రావాలని కోరుకోవడం లేదు' అని తేల్చి చెప్పేశారు. అలాగే సోషల్ మీడియా, మీడియాలో వచ్చే పేర్లపై, ప్రచారం చేసుకునే నేతలపై అధిష్టానం సీరియస్‌గా ఉందని కేంద్రమంత్రి వెల్లడించారు.బండి సంజయ్ ఇంకా మాట్లాడుతూ.. డీలిమిటేషన్‌పై చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల సమావేశంపై స్పందించారు. స్టాలిన్ మీటింగ్‌లో ఉన్నది అందరూ దొంగలే అంటూ కామెంట్స్ చేశారు. లిక్కర్ స్కామ్, ల్యాండ్ స్కామ్ ముఠాలు మీటింగ్ పెట్టుకున్నాయని దుయ్యబట్టారు. మీటింగ్‌లో పాల్గొన్న పార్టీలకు అవినీతి చరిత్ర ఉందన్నారు. కేసీఆర్ కుటుంబానికి నోటీస్ ఎందుకు ఇవ్వవు రేవంత్ అని ప్రశ్నించారు. డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమే కాలేదని తెలిపారు. తమిళనాడులో డీఎంకే వెయ్యి కోట్ల లిక్కర్ స్కామ్ చేసిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏర్పడి 15 నెలలు అయినా రైతులను పట్టించుకోవడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు.మరోవైపు రాజాసింగ్ కూడా తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడికి సంబంధించి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు నూతన అధ్యక్షుడిని ఎవరు నియమిస్తారని ప్రశ్నించారు. స్టేట్ కమిటీ నియమిస్తే మాత్రం ఆ అధ్యక్షుడు రబ్బరు స్టాంప్ అంటూ కామెంట్స్ చేశారు. గతంలో ఉన్న అధ్యక్షులు తమ గ్రూప్‌లను ఏర్పాటు చేసుకోవడం వల్లే తెలంగాణలో పార్టీకి నష్టం కలిగిందన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలను హ్యాండ్ ఫ్రీగా వదిలేస్తే తెలంగాణలో బీజేపీ రావడం ఖాయమని ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు.

# బెట్టింగ్ యాప్స్ కేసు.. ఒక్కొక్కరికీ చుక్కలు చూపిస్తున్న పోలీసులు




**సూర్యాపేట (మన వెలుగు) మార్చి 22:** సూర్యాపేటలో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు నమోదు అయ్యింది. నూతనకల్ పోలీస్‌స్టేషన్‌లో యూట్యూబర్ ఇన్ఫ్లుయెన్సర్ భయ్యా సన్నీ యాదవ్‌పై కేసు నమోదు చేశారు పోలీసులు. సన్నీయాదవ్ విదేశాల్లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. లుక్‌ఔట్ సర్క్యూలర్ జారీ చేశారు. ఈనెల 5న సన్నీ యాదవ్‌పై బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌పై సుమోటో కేసు నమోదు అయ్యింది. ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు తాజాగా లుక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. త్వరలోనే అతడిని పట్టుకుంటామని సూర్యాపేట పోలీసులు చెబుతున్నారు. దేశ విదేశాల్లో బైక్‌పై రైడ్ చేస్తున్న సన్నీ యాదవ్.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా వేదికగా బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశాడు.ఈ నేపథ్యంలోనే ఈనెల 5న నూతనకల్ పోలీస్‌స్టేసన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు లుక్‌ఔట్ నోటీసులు జారీ చేయడంతో ఎలాగైన సన్నీ యాదవ్‌ను విదేశాల నుంచి రప్పించి అరెస్ట్ చేయాలని పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు సన్నీ యాదవ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని యూట్యూబర్ పిటిషన్ వేశారు. దీనిపై విచారించిన హైకోర్టు.. తదుపరి విచారణ ఈనెల 24కు వాయిదా వేసింది.వరుస కేసులు..ఇక.. బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ చేస్తున్న వారిపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు వరుసగా కేసులు నమోదు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్‌లో మైనంపల్లి హనుమంతరావు ఫిర్యాదు చేశారు. బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల్లో బెట్టింగ్ చేసి డబ్బు పోగొట్టుకొని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మైనంపల్లి హనుమంతరావు ఫిర్యాదు చేశారు.అలాగే ఓయూలో బెట్టింగ్ యాప్ ప్రోత్సహిస్తున్న వారిపై జనసేన విద్యార్థి విభాగం ఫిర్యాదు చేసింది. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న జబర్దస్త్ వర్ష, హర్ష సాయిలపై జనసేన విద్యార్థి విభాగం అధ్యక్షుడు సంపత్ నాయక్ ఫిర్యాదు చేశారు. బెట్టింగ్ యాప్‌తో చావులకు కారణమైన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని పిర్యాదులో తెలిపారు. సినీ నటుడు అలీ సతీమణి జూబెద, లాస్య యూట్యూబ్ ఛానెల్స్‌ను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సంపత్ నాయక్ డిమాండ్ చేశారు.

# జాతీయ ఉద్యమంగా మారిన పునర్విభజన



**చెన్నై :** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం లోని బీజేపీకి, పలు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు పలు రాష్ట్రాల నాయకులతో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మార్చి 22 న జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందు స్టాలిన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో జనాభా ప్రాతిపదికన విభజన జరిగితే రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎక్స్ వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరవుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, ఒడిశా, పశ్చిమబెంగాల్ , పంజాబ్ నాయకులకు నా హృదయ పూర్వక స్వాగతం . మార్చి 5న జరిగిన అఖిలపక్ష సమావేశం ఒకమైలు రాయి. 2026 ఏడాదిలో జరిగే పునర్విభజన జనాభా ప్రాతిపదికన జరిగితే పార్లమెంటులో మన ప్రాతినిధ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. ఇది కేవలం ఎంపీల సంఖ్య గురించి మాత్రమే కాదు, రాష్ట్ర హక్కుల భంగం గురించి. అందుకే దీనిపై బీజేపీ తప్ప మిగిలిన పార్టీలన్నీ ఏకమయ్యాయి. తమిళనాడు లోని 58 పార్టీలు సైతం విభేదాలను పక్కనపెట్టి సముచితమైన పునర్విభజనకు ఒక్కటయ్యాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను తొలుత తమిళనాడు వ్యతిరేకించింది. దీనికి అన్ని రాష్ట్రాలు చేతులు కలపడంతో ప్రస్తుతం ఇది ఒక జాతీయ ఉద్యమంగా మారింది. " అని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం జరిగే సమావేశం దేశ భవిష్యత్తును రూపొందించే ఉద్యమానికి నాంది అని ఆయన అభివర్ణించారు. ఈ నెల 5 న స్టాలిన్ నేతృత్వం లో చెన్నైలో అఖిలపక్ష సమావేశం జరిగింది. అందులో పునర్విభజనను వ్యతిరేకిస్తున్నట్టు అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. పార్లమెంట్ సభ్యుల సంఖ్యను పెంచే పక్షంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇరు సభల్లో రాష్ట్రాల మధ్య ప్రస్తుతమున్న నిష్పత్తి మేరకు నియోజకవర్గాల సంఖ్యను పెంచడానికి అవసరమైన రాజ్యాంగ సవరణలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో పునర్విభజన వల్ల జరిగే నష్టాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు కలిసి రావాలని ఏడు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖలు రాశారు. ఈ నెల 22న చెన్నైలో నిర్వహించే సమావేశానికి ప్రతినిధులను పంపాలని ఆయన అందులో కోరారు.

మన వెలుగు
TEL:T/TG/2024/0814
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



## నాగ్‌పూర్‌లో కర్ఫ్యూ..డిసిపిలు సహా పలువురికి గాయాలు



**నాగ్‌పూర్ :** మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో చేపట్టిన నిరసన హింసాకాండకు దారితీయడంతో పలు ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించినట్లు పోలీస్ అధికారులు మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం చెలరేగిన హింసాకాండలో ముగ్గురు డిసిపిలు (డిప్యూటీ కమిషనర్స్ ఆఫ్ పోలీస్) సహా 12 మంది పోలీస్ సిబ్బంది గాయపడ్డారని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. హింసాకాండకు సంబంధించి 15 మందిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కొత్వాలి, గణేష్ పేట్, తహసీల్, లకడ్‌గంజ్, పచ్‌పవోలి, శాంతినగర్, సక్కర్ధార, నందన్‌వన్, ఇమాంబాడా, యశోధర నగర్, కపిల్‌నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ విధించినట్లు ప్రకటించారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని ధ్వంసం చేయాలంటూ సోమవారం సాయంత్రం భజరంగ్ దళ్ కార్యకర్తలు చేపట్టిన ఆందోళన హింసకు దారితీసింది. ఒక వర్గానికి చెందిన పవిత్రగ్రంథాన్ని దగ్ధం చేసినట్లు పుకార్లు వ్యాపించడంతో పోలీసులపై రాళ్లు రువ్వారని అధికారులు తెలిపారు. ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. హన్సపురి ప్రాంతంలో రాత్రి 10.30 నుండి 11.30 గంటల మధ్య మరో ఘర్షణ జరిగింది. అల్లరిమూకలు పలు వాహనాలను తగులబెట్టారు. ఆ ప్రాంతంలో ఒక నివాసాన్ని, క్లినిక్‌ను కూడా ధ్వంసం చేశారు.

## వక్ఫ్ బిల్లుపై తప్పుదారి పట్టిస్తున్నారు



**న్యూఢిల్లీ :** వక్ఫ్ చట్టానికి ప్రతిపాదిత సవరణలపై ముస్లింలను ప్రతిపక్షాలు 'తప్పుదారి పట్టిస్తున్నాయి' అని బిజెపి సోమవారం ఆరోపించింది. బిల్లు పార్లమెంట్ ఆమోదముద్ర పొందినట్లయితే స్పష్టమైన టైటిళ్లు ఉన్న వక్ఫ్ ఆస్తుల్లో 'ఒక్క అంగుళమైనా' పరాధీనం కాదని బిజెపి స్పష్టం చేసింది. అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఎఐఎంపిఎల్‌బి) సారథ్యంలో పలు ముస్లిం సంస్థలు ఢిల్లీలో వక్ఫ్ (సవరణ) బిల్లుపై నిరసన ధర్నాలో పాల్గొన్న నేపథ్యంలో బిజెపి ఆ ఆరోపణ చేసింది. పలువురు ఎంపిలు ధర్నాలో పాల్గొన్నారు. బిల్లుకు మద్దతు ఇచ్చిన పక్షంలో ముస్లింలు ఎన్నటికీ క్షమించబోరని ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు టిడిపి. జెడి (యు), ఎల్‌జెపి(రామ్‌విలాస్)లను ఎఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరించారు. ఆ ధర్నాపై వ్యాఖ్యానించవలసిందని మీడియా కోరినప్పుడు బిజెపి ఎంపి తేజస్వి సూర్య స్పందిస్తూ, 'దేశంలో వోటు బ్యాంకు రాజకీయాలు భయం ఆధారంగానే ఎల్లప్పుడూ సాగుతున్నాయి. సెక్యులర్ పార్టీలుగా చెప్పుకుంటున్నవి అనుసరించే పద్ధతే అది' అని అన్నారు. 'వక్ఫ్ ఆస్తుల యాజమాన్యంలో ప్రొఫెషనలిజాన్ని, మేలైన నిర్వహణను, పారదర్శకతను తీసుకురావడమే వక్ఫ్ బిల్లును తేవడంలో ప్రభుత్వ ఉద్దేశం అని ప్రతి ఒక్కరికీ హామీ ఇస్తున్నాను' అని తేజస్వి సూర్య ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో విలేకరుల గోష్ఠిలో చెప్పారు. వక్ఫ్‌కు చెందని భూముల ఆక్రమణకు వక్ఫ్ బోర్డు అధికారాల దుర్వినియోగం చెందకుండా ప్రభుత్వం చూసిందని ఆయన తెలిపారు. 'స్పష్టమైన టైటిళ్లు ఉన్న అన్ని సంస్థలు, ఏళ్ల తరబడి ఉనికిలో ఉన్న అన్ని ప్రార్థనా స్థలాలలో ఏ ఒక్కదానికీ కొత్త వక్ఫ్ చట్టం గురించి భయం ఉండరాదు' అని సూర్య అన్నారు. ముస్లింలను తప్పుదారి పట్టించే యత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు, 'అటువంటి భూముల్లో ఒక్క అంగుళం పరాధీనం కాదు' అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షాలపై సూర్య విరుచుకుపడుతూ, సెక్యులర్ పార్టీలుగా చెప్పుకుంటున్నవి ముస్లింల కోసం ఏమీ చేయలేదని, అవి వారిని బెదరగొట్టే, తప్పుదారి పట్టించే యత్నాలే చేశాయని ఆరోపించారు. 'వక్ఫ్ బోర్డులను మరింత పటిష్ఠం చేయడమే ప్రభుత్వ ఉద్దేశం' అని సూర్య చెప్పారు.

## మాజీ కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్ కన్నుమూత



బిజెపి నేత, మాజీ కేంద్ర మంత్రి దేవేంద్ర ప్రధాన్(84) సోమవారం కన్నుమూశారు. ఆయన అటల్ బిహారీ వాజ్‌పేయి హయాం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఆయన మూడుసార్లు ఒడిశా బిజెపి అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రధాన్‌కు ఇద్దరు కుమారులు. న్యూఢిల్లీలోని తీన్‌మూర్తి వీధిలోని తన కుమారుడి అధికార నివాసంలో ఆయన చివరి శ్వాసను వదిలారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలిపారు. కాగా ప్రధాని నరేంద్ర మోడీ, దేవేంద్ర ప్రధాన్ మృతదేహానికి పుష్పాంజలి ఘటించి, ఆయన ఒడిశాలో బిజెపి బలపడ్డానికి ఎంతో కృషిచేశారని కీర్తించారు. అంతేకాక ఆయన ఎంపీగా బాగా కృషి చేసేవారని, దారిద్ర్య నిర్మూలనకు, సామాజిక స్వాధికారతకు పాటుపడ్డారని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతున్నాను అంటూ ఎక్స్ పోస్ట్ పెట్టారు. తీన్‌మూర్తి లేన్‌లోని ఆయన నివాసానికి అనేక మంది కేంద్ర మంత్రులు వెళ్లి నివాళులర్పించారు. దేవేంద్ర ప్రధాన్ 1998 లోక్‌సభ ఎన్నికల్లో దేవ్‌గఢ్ నుంచి తొలిసారి ఎన్నికయ్యారు. 1999 నుంచి 2001 వరకు కేంద్ర రవాణ, వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. ఒడిశా ప్రగతికి ఆయన ఎంతో పాటుపడ్డారని గవర్నర్ హరిబాబు కంభంపాటి కీర్తించారు. ఆయన మృతదేహాన్ని సాయంత్రం ఢిల్లీ నుంచి భువనేశ్వర్‌కు తీసుకొస్తారని కుటుంబసభ్యులు తెలిపారు.

## మళ్లీ మారుతీ సుజుకీ ధరల పెంపు

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మరోమారు తమ వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి తమ వాహన ధరలను 4 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్లు ఆ కంపెనీ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో గత రెండు నెలల్లో ఇది రెండోసారి పెంపు కావడం గమనార్హం. తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ వ్యయాల భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయడం మినహా వేరే మార్గం లేదని ఆ కంపెనీ పేర్కొంది. ఈ కంపెనీ ప్రాథమిక మోడల్ ఆల్టో కె-10 నుంచి ఇన్విక్టో మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరల శ్రేణీ రూ.4 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు ఉంది. ఇంతక్రితం మోడళ్లను బట్టి గరిష్ఠంగా రూ.32,500 వరకు పెంచేసింది. తాజా పెంపునతో కొనుగోలుదారులపై మరింత భారం పడనుంది.


## అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో నకిలీ ఉత్పత్తులు

ఇ-కామర్స్ సంస్థల్లో నకిలీ ఉత్పత్తులు, ప్రామాణికత లేని ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఎట్టకేలకు దృష్టి పెట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ ఆన్‌లైన్ విక్రేతలకు చెందిన గిడ్డంగులపై బిఐఎస్ దాడులు చేసి వేలాది ధృవీకరించని ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 7న లక్నో, గురుగావ్, ఢిల్లీలోని ఇ-కామర్స్ గిడ్డంగులపై బిఐఎస్ దాడులు నిర్వహించింది. లక్నోలోని అమెజాన్ గిడ్డంగి నుండి 215 బొమ్మలు, 24 హ్యాండ్ బ్లెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బిఐఎస్ సర్టిఫికేషన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఫిబ్రవరి 2025లో గురుగావ్‌లోని అమెజాన్ గిడ్డంగిపై జరిగిన దాడిలో 58 అల్యూమినియం ఫాయిల్స్, 34 మెటాలిక్ వాటర్ బాటిళ్లు, 25 బొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పివిసి కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్ గురుగావ్ గిడ్డంగిలో జరిపిన సోదాల్లో సర్టిఫికెట్లు లేని 534 స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు, 134 బొమ్మలు, 41 స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. బిఐఎస్ గుర్తింపు లేని ఉత్పత్తులను ఆయా సంస్థల్లో నిరంతరం విక్రయించడంపై ఫిర్యాదులు అందిస్తోన్న నేపథ్యంలో సోదాలు చేసినట్లు సమాచారం.

## నాలుగు నిషేధిత సంస్థల సభ్యుల అరెస్ట్

**ఇంఫాల్:** మణిపూర్‌లో గడిచిన 24 గంటల్లో నిషేధిత సంస్థలకు చెందిన నలుగురు ఉన్నత స్థాయి అధికారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఇంఫాల్ వెస్ట్ మరియు బిష్ణుపూర్ జిల్లాల నుండి వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని లాంగోల్ గేమ్ విలేజ్ జోన్ 11 నుండి నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన లౌరెంబమ్ బ్రోజెన్ సింగ్ (50)ని అరెస్ట్ చేసినట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. అదే జిల్లా నుండి నిషేధిత ప్రేపాక్ /ఉప్క్ సభ్యుడు రోమియో సింగ్, కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (పిబ్ల్యుజి) కేడర్ లైష్రామ్ టోంబాలను అరెస్ట్ చేశామని అన్నారు. బిష్ణుపూర్ జిల్లా నుండి పిడబ్ల్యుజి మరో కేడర్ ఖుంద్రక్‌పామ్ మైఖేల్‌లను అరెస్ట్ చేశామని అన్నారు. ఒక 9 ఎంఎం పిస్టల్, ఒక ఖాళీ మేగజైన్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధి వద్ద భద్రత పెంపు



ఛత్రపతి శంభాజీనగర్: మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని కూల్చేయాలని కొందరు డిమాండ్ చేస్తుండడంతో పోలీసులు, అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. మహారాష్ట్రలోని శంభాజీనగర్ జిల్లా ఖుల్దాబాద్‌లో ఉన్న ఔరంగజేబు సమాధి వద్దకు వెళ్లే సందర్శకులపై ఆంక్షలు విధించారు. ఇకపైన అక్కడికి ఎవరైనా వెళితే రిజిస్టర్‌లో సంతకం చేయడంతో పాటు, ఐడి కార్డును చూపించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద విహెచ్‌పి కార్యకర్తలు నిరసనలు చేపట్టి, ఔరంగజేబు సమాధిని నిర్మూలించాలంటూ మెమోరాండంలు సమర్పించారు. ఔరంగజేబు రాజ్యవిస్తరణను మరాఠులు గట్టిగా అడ్డుకున్నారన్నది ఇక్కడ గమనార్హం. ఇదిలావుండగా ఖుల్దాబాద్‌కు వెళ్లే దారిలో అనేక చోట్ల సెక్యూరిటీ పోస్ట్‌లను ఛత్రపతి శంభాజీనగర్ రూరల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటుచేసింది. సమాధి, తదితర ప్రాంతాల్లో 50 మంది సిఆర్‌పి, 30 మంది స్థానిక పోలీసులు, 20 హోంగార్డులను మోహరించారు. సమాధిని సందర్శించే పర్యాటకులు రిజిష్టరులో తమ పేరు వివరాలు రాయడమేకాక, ఐడి కార్డును చూయించాల్సి ఉంటుంది. కాగా 'ఇక్కడ వాతావరణం ప్రశాంతంగానే ఉంది. ప్రజలు వదంతులను నమ్మకూడదు. ఔరంగజేబు సమాధిని నిర్మూలించాలని డిమాండ్ మొదలయినప్పటి నుంచి పర్యాటకుల సందర్శన సంఖ్య ఇంకా బాగా పెరిగింది' అని సమాధి కేర్‌టేకర్ పర్వేజ్ కబీర్ అహ్మద్ తెలిపారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే 'మతమార్పిడికి అంగీకరించకపోవడంతో ఔరంగజేబు సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ ఇద్దరు కుమారులను చంపించాడు, మరాఠా యోధుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్‌ను చిత్ర హింసలు పెట్టి చంపాడు. అంతేకాక కాశీ, మథుర, సోమ్‌నాథ్‌లోని అనేక మందిరాలను కూల్చేశాడు' అంటూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు సమర్పించిన మెమోరాండంలో విహెచ్‌పి పేర్కొంది. 'ఔరంగజేబుకు సంబంధించిన ఎలాంటి చిహ్నం అయినా బాధాకరమే' అని కూడా పేర్కొంది.

## తోబుట్టువులు, బంధువులు అంతా 'బహుజన్ సమాజ్' భాగస్తులే



లక్నో: తన తోబుట్టువులు, బంధువులు అంతా 'బహుజన్ సమాజ్ 'భాగస్తులేనని ఆ పార్టీ చీఫ్ మాయావతి సోమవారం అన్నారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ 'ఎవరైనా సరే బహుజన్ సమాజ్(బిఎస్‌పి) కోసం పనిచేస్తే వారిని ప్రమోట్ చేస్తాను, ఇందులో బంధుత్వం ఏదీ అడ్డు రాదు' అన్నారు. 'నేను బతికి ఉన్నంత వరకు పార్టీని తోబుట్టువులు, బంధువులు బలహీనపరచడాన్ని ఆమోదించను. నా తోబుట్టువులు, బంధువులు కేవలం పార్టీ భాగస్తులే. ఆమె తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ అన్ని పదవుల నుంచి తప్పించడంతో, ఆమె తాజా వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దేశవ్యాప్తంగా బిఎస్‌పి వ్యవహారాలు చూసుకునేందుకు మాయావతి తన సోదరుడు ఆనంద్ కుమార్, రామ్జీ గౌతమ్‌లను జాతీయ కోఆర్డినేటర్లుగా నియమించారు. ప్రధాని నరేంద్ర మోడీ గురించి మాట్లాడుతూ ఆమె 'ప్రధాని ఎప్పుడూ తాను పేదరికాన్ని అనుభవించానని చెప్పుకుంటారు.

## 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అంతంత మాత్రమే



15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల తక్కువగా ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానంలో స్పష్టమైంది. 2021-22లో రూ.21,342.43 కోట్లు, 2022-23లో రూ.13,174.27 కోట్లు, 2023-24లో 9,640.84 కోట్లు, 2024-25లో రూ.3,989.72 కోట్లు విడుదల చేశారు. అందులో పట్టణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.956 కోట్లు కేటాయించగా, రూ.1,157.35 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.990 కోట్లు కేటాయించగా, రూ.735.75 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.1,046 కోట్లు కేటాయించగా, రూ.984.55 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.1,109 కోట్లు కేటాయించగా, రూ.305.05 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.4,101 కోట్లు కేటాయిస్తే, రూ.3,182.7 కోట్లు విడుదల చేశారు. గ్రామీణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.1,939 కోట్లు కేటాయించగా, రూ.969.50 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.2,010 కోట్లు కేటాయించగా, రూ.948.35 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.2,031 కోట్లు కేటాయించగా, రూ.3,974.19 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.2,152 కోట్లు కేటాయించగా, రూ.2,109.97 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.8,132 కోట్లు కేటాయిస్తే, రూ.8,002.01 కోట్లు విడుదల చేశారు.

## స్టాక్ మార్కెట్ సూచీలు లాభాలతో ప్రారంభం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం గడిచిన సెషన్‌లోని ముగింపుతో పోలిస్తే లాభాల్లో కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 9:19 సమయానికి నిఫ్టీ 106 పాయింట్ పెరిగి 22,612 కు చేరింది. సెన్సెక్స్ 321 పాయింట్లు పెరిగి 74,487 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 103.52 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 71.25 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.28 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.65 శాతం పెరిగింది. నాస్‌డాక్ 0.31 శాతం పుంజుకుంది. స్టాక్ మార్కెట్ స్థిరీకరణలో భాగంగా సోమవారం మిడ్ క్యాప్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించగా, చిన్న షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. డాలర్ ఇండెక్స్ బలహీనత, దేశీయ ఈక్విటీ మార్కెట్లో కొనుగోళ్ల దన్నుతో డాలర్ మారకంలో రూపాయి విలువ 24 పైసలు పెరిగి 86.81 వద్ద స్థిరపడింది. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకల నేపథ్యంలో 'బ్యాంకు ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంది' అంటూ ఆర్‌బీఐ భరోసాతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు కోలుకుంది. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఎస్‌అండ్‌పీ సూచీ 0.65 శాతం, నాస్‌డాక్ 0.31 శాతం, డోజోన్స్ 0.85 శాతం లాభపడ్డాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. జపాన్ నిక్కీ, హాంకాంగ్ హాంగెసెంగ్ 1 శాతం మేర లాభంతో కదలాడుతుంటే.. షాంఘై, ఆస్ట్రేలియా ఏఎస్‌ఎక్స్ మాత్రం బలహీనంగా ట్రేడవుతున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు మంగళవారం నికరంగా రూ.4,488 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.6,001 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.

మన వెలుగు
MANA VELUGU TELUGU DAILY



# యువతకు స్ఫూర్తి భగత్ సింగ్



భగత్ సింగ్ (1907 సెప్టెంబరు 28-1931 మార్చి 23) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, కరుడుకట్టిన ఉద్యమకారుడు. ఢిల్లీ వీధిలో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్య పరిచాడు. విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాన్ని ఇచ్చింది కూడా భగత్ సింగే. భారత స్వాతంత్ర్యోద్యమము లో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారులలో ఆయన ఒకడు. ఆ కారణంగానే షహీద్ భగత్ సింగ్‌గా నేటికీ కొనియాడ బడుతున్నాడు. భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లో, ప్రస్తుత పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝాట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించాడు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. భగత్ సింగ్ మూడేళ్ళ పిల్లాడిగా ఉన్నప్పుడు తండ్రి కిషన్ సింగ్, భగత్ సింగ్‌ను చంకకెత్తుకొని, కొత్తగా వేస్తున్న తోటను చూడ్డానికి పొలాల్లోకి వెళ్ళాడు. వెంటనే కిందికిదిగిన భగత్‌సింగ్ ఆ మట్టిలో ఆడుకుంటూనే చిన్నచిన్న గడ్డిపరకలను నాటడం మొదలు పెట్టాడు. తండ్రి "ఏం చేస్తున్నావ్ నాన్నా" అని ప్రశ్నిస్తే, భగత్ సింగ్ "తుపాకులు నాటుతున్నా" అని బదులిచ్చాడు. భవిష్యత్తుకు బాల్యం మొలకలు వేసే వయస్సులో తుపాకులను మొలకెత్తించాలని చూడడం ఆయన వ్యక్తిత్వానికి మచ్చుతునక. 13 ఏళ్ల ప్రాయంలోనే మహాత్మా గాంధీ సహాయ నిరాకరణో ద్యమానికి సింగ్ ప్రభావితుడ య్యాడు. ఆ సమయంలో బ్రిటీష్ ప్రభుత్వానికి ఎదురుతిరిగిన భగత్ ప్రభుత్వ పాఠశాల పుస్తకాలు, బ్రిటీషు దిగుమతి దుస్తులను తగులబెట్టడం ద్వారా గాంధీ సిద్ధాంతాలను అనుసరించాడు. లాలాలజ్‌పత్ రాయ్ మరణం, సాండర్స్ హత్యల తరువాత 1928లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటుచేసింది. భారత దేశానికి వచ్చిన సైమన్ కమిషన్లో ఒక్క భారతీయుడైనా లేనందుకు నిరసనగా, ఉద్యమంలో లాల్‌జీ కీలక పాత్ర వహించి, సైమన్ కమిషన్‌ను బహిష్కరించాలి అంటూ పంజాబ్ అసెంబ్లీలో ఆయన తీర్మానం పెట్టి గెలిపిం చారు. ఇది ప్రభుత్వానికి కంటగిం పుగా మారింది.అక్టోబర్ 30, 1928న ఆ కమిషన్ లాహోర్ రాగా, లాల్‌జీ కూడా అహింసతో, మౌనంగా సైమన్ వ్యతిరేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మౌనంగా ఉద్యమి స్తున్న వారిపైన కూడా లాఠీ చార్జికి ఆదేశించాడు పోలీసు సూపరింటెం డెంట్ జేమ్స్ ఏ స్కాట్. తను స్వయంగా లాల్‌జీ మీద దాడి చేసి, లాల్‌జీ ఛాతీ మీద లాఠీ తో స్కాట్ తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలతోనే లాల్‌జీ నవంబర్ 17న చని పోయారు. ఈ సంఘటనను కళ్లారా చూసిన భగత్ సింగ్ ప్రతీకారం తీర్చు కోవాలని నిర్ణయించు కున్నాడు. పోలీసు అధికారి స్కాట్‌ను హత మార్చడానికి విప్లవకారులు శివరామ్ రాజ్‌గురు, జై గోపాల్, సుఖ్‌దేవ్ థాపర్‌లతో ఆయన చేతులు కలిపాడు. డీఎస్పీ జే. పీ. సాండర్స్ కనిపించినప్పుడు పొర పాటుగా స్కాట్ అనుకుని, జైగో పాల్ ఆయన్ను కాల్చమంటూ సింగ్‌కు సంకేతాలిచ్చాడు. ఫలితం గా స్కాట్‌కు బదులు సాండర్స్ హతమయ్యాడు. ఫిరోజ్ పూర్లో బ్రిటీష్ పోలీసు అధికారి జె.పి.సాండర్స్ ను హత మార్చి నందుకు గాను వారికి 1930లో అక్టోబర్ 7వ తేదీని ఈ మరణ శిక్షను ఖరారు చేశారు. భగత్ సింగ్ సహా ముగ్గురికి ఉరిశిక్ష ఖరారు చేసిన తీర్పు వివరాలను 2015లో ప్రచురించారు. ఝొతీతీఖత్ శీట జుఇవఎఔఅశీఅ రాఅ ావత్‌వఅఎవ రాట ఐమ్మేష్ట అనే విడుదల చేసిన పత్రంలో 1930 అక్టోబర్ 7వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పిచ్చినట్లు స్పష్టంగా ఉంది. 1931, మార్చి 23న ఉరిశిక్ష అమలు చేసినట్లు మరో పత్రంలో వివరాలు ఉన్నాయి. జైలు సూపరింటెండెంట్ సంతకం చేసిన పేపర్‌ను టైమ్స్ ఫ్యాక్ట్ చెక్ గుర్తించి బహిర్గతం చేసి, లాహోర్ లోని పంజాబ్ శాఖలో ఈ పత్రాలను ఇటీవల ప్రదర్శనకు ఉంచారు. 1930 అక్టోబర్ 7 న న్యాయస్థానము తీర్పును వెలువరించింది. తీర్పు 281 పేజీల్లో ఇవ్వబడింది. విచారణ ఎదుర్కొన్న వారందరికీ ఇలా శిక్షలు ఇవ్వబడ్డాయి. ఉరిశిక్ష: 1.భగత్ సింహ్ 2. సుఖ్‌దేవ్ 3. రాజగురులకుబీ అలాగే ఆజన్మాంతర జీవిత ఖైదు: 1.కిశోరీలాల్ 2. మహావీర్ సింహ్ (అండమాన్లో 9 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడయ్యాడు. 3. విజయ్ కుమార్ సింహ్ 4. శివవర్మ 5. గయా ప్రసాద్ 6. జయదేవ్ కపూర్ 7. కమల్నాథ్ తివారిలకుబీ అలాగే జీవిత ఖైదు: 1.కుందాన్లాల్ ( 7 సంవత్సరాలు) 2. ప్రేమదత్ ( 5 సంవత్సరాలు)లకుబీ అలాగే అజయ్ ఘోష్, సురేంద్రనాథ్ పాండియ ఇంకా జితేంద్రనాథ్ సన్యాల్‌లను విడిచిపెట్టారు. విచారణలో ఉన్నవారందరూ కోర్టులను బహిష్కరించడం వలన తీర్పును లాహోర్ లోని సెంట్రల్ జైలు లో వినిపించారు. తమను యుద్ధ ఖైదీలుగా గుర్తించడం ద్వారా ఉరి తీయ కుండా కాల్పుల బృందం చేత హతమార్చాలని జైలులో ఉన్నప్పుడు భగత్ సింగ్, మరో ఇద్దరు వైస్రాయికి లేఖ రాశారు. క్షమాభిక్ష ముసాయిదా లేఖపై సంతంకం కోసం భగత్ సింగ్ మిత్రుడు ప్రన్నత్ మెహతా ఆయన్ను ఉరితీయడానికి నాలుగు రోజుల ముందు మార్చి 20న జైలులో కలిశాడు. అయితే సంతకం చేయడానికి సింగ్ నిరాకరించాడు. మార్చి 23న ఉరితీసినట్లు జైలు అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని విడుదల చేశారు. అప్పటి సూపరింటిండెంట్ ఆఫ్ పోలీస్ వి.ఎన్. స్మిత్ ప్రకారం, భగత్ సింగ్‌ను ముందుగానే ఉరితీశారు. సాధారణంగా ఉదయం 8 గంటలకు ఉరితీసేవారు. అయితే ఏమి జరిగిందో ప్రజలు తెలుసుకునే లోగానే ఆయన్ను ఉరితీయాలని నిర్ణయించుకుని..సుమారు రాత్రి 7 గంటల ప్రాంతంలో ఉరి తీశారు. భగత్ సింగ్ వీర మరణం వృథా కాలేదు, ఎందరో యువకులను భారత స్వాతంత్ర్యోద్యమము వైపుకు మరల్చింది.భగత్ సింగ్ మరణం భారత స్వాతంత్ర్యోద్యమ కొనసాగింపుకు సాయపడేలా వేలాది మంది యువకుల్లో స్ఫూర్తిని నింపింది. ఆయన ఉరి అనంతరం ఉత్తర భారతాన పలు ప్రాంతాల్లో బ్రిటీష్ ప్రభుత్వమునకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి.

# మానవ సేవలో శాస్త్ర సాంకేతిక పాత్ర

నేడు ప్రపంచవ్యాప్తంగా 75వ 'ప్రపంచ వాతావరణ శాస్త్ర సంస్థ' అవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించుకుంటున్న వేళ 2025 ఏడాదిని "ముందస్తు హెచ్చరికల వాతావరణశాస్త్ర సాంకేతికతలో గ్యాప్‌లను తగ్గించడం" అనే ఇతివృత్తం తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నాయి. తీవ్రమైన ప్రమాదకర వాతావరణ పరిస్థితులు ముందస్తు తెలుసుకోవడం వల్ల జరగనున్న ఆస్తి ప్రాణ నష్టాలను తగ్గించడానికి మానవాళికి సరైన సమయం దొరకడం, నష్ట నివారణ చర్యలు తీసుకోవడం జరుగుతూ వస్తున్నది. వాతావరణ హెచ్చరికల రంగంలో వస్తున్న నూతన విప్లవాత్మక మార్పులను స్వాగతిస్తూ, మరింత ముందంజ వేయడానికి ప్రతి ఏట 23 మార్చిన "ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం" లేదా "వరల్డ్ మెటీరియొలాజికల్ డే" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. హరికేన్లు, అకాల వర్షాలు, కరువుకాటకాలు, మండుటెండలు, తుఫాన్లు, తీవ్రమైన గాలుల లాంటి వాతావరణ ప్రతికూల పరిస్థితులను ముందుగానే ఖచ్చితమైన అంచనాలతో పసిగట్టడంతో పాటు ఆయా ప్రాంతాల ప్రభుత్వాలు, ప్రజలను ముందస్తు హెచ్చరించడం నిరంతరం కొనసాగడానికి నవ్య వాతావరణ శాస్త్ర సాంకేతికతలు, ఏఐ టెక్నాలజీలను వినియోగించడం నేటి మానవాళికి వరంగా మారింది. గతంలో రేడియో లేదా ప్రభుత్వ యంత్రాంగాల ద్వారా వాతావరణ ప్రతికూలాల హెచ్చరికలు జరుగుతూ ఉండేవి. నేటి డిజిటల్ యుగంలో క్షణాల్లో హెచ్చరికల వార్తలు ప్రజల ముంగిట్లో ప్రత్యక్షం కావడంతో నష్ట నివారణ విజయవంతంగా జరుగుతున్నది. 2025 ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం ఇతివృత్తంగా "అన్ని కాలాలకు, అన్ని వర్గాల ప్రజలకు కొలతలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. 'మీటర్ కన్వెన్షన్' ఏర్పడి నేడు 150వ వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ ఈ ఇతివృత్తం అధిక ప్రాధాన్యతను సంచరించుకున్నది. నేడు పర్యావరణ కాలుష్యం కోరలు చాస్తున్న వేళ అకాల వర్ష వడగళ్లు, తీవ్రమైన రువుకాటకాలు, ఆకస్మిక పెను తుఫాన్లు మంచు వర్షాలు, అడవుల్లో కార్చిచ్చులు, అపరిమిత ఉష్ణోగ్రతలు లాంటి వాతావరణ మార్పులను ముందుగానే పసిగట్టి ప్రజలను చైతన్య పరచడం జరుగుతోంది. ప్రజల ప్రాణాలు కాపాడడం, జీవనోపాధులను పరిరక్షించడం, పౌరసమాజాన్ని అన్ని వేళ్ల జాగరూకతతో ఉంచడం, అత్యవసర సేవలను సిద్ధం చేయడం, విపత్తు నివారణ విభాగాలను సర్వ వేళల్లో సిద్ధంగా ఉంచడంలో ముందస్తు వాతావరణ హెచ్చరికలు తోడ్పడుతున్నాయి. నేటి ప్రపంచ దేశాల్లో దాదాపు 108 దేశాలు ఆధునిక వాతావరణ శాస్త్ర సాంకేతికతలను వినియోగిస్తున్నప్పటికీ అల్పాదాయ దేశాల్లో నేటికీ పరిస్థితులు భిన్నంగానే ఉన్నాయి. గత కొన్ని ఏళ్లలో దాదాపు 39 శాతం వరకు ముందస్తు హెచ్చరికల వ్యవస్థల్లో అభివృద్ధి సాఘధించడం గమనార్హం. నేటి విపరీత పరిస్థితుల్లో వాతావరణ ప్రతికూల మార్పులు, తీవ్రమైన వాతావరణ ప్రతిచర్యలకు సమాధానంగా ప్రపంచ దేశాలు ప్రభుత్వాలు, వాతావరణ శాస్త్ర అత్యాధునిక పరిశోధనా సంస్థలు, వాతావరణ శాస్త్ర విభాగాలను పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైందని తెలుసుకోవాలి. వాతావరణ ప్రతికూల మార్పుల వెనుక దాగి ఉన్న కారణాలతో పాటు వాటిని ప్రతిఘటించడం, ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండడం, కనిష్ట నష్టాలను నమోదు చేసుకోవడం లాంటి అంశాలకు అవగాహన పర్చుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలి. వాతావరణ విధ్వంసాలను అరికట్టడానికి కార్బన్ ఉద్గారకాలను తగ్గించడం, మొక్కలు నాటడం, పర్యావరణ హిత పాలసీల అమలు, పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలు, అవగాహనలు కొనసాగుతూనే ఉండాలి. ప్రభుత్వ వాతావరణ శాస్త్ర విభాగం ద్వారా వాతావరణ హెచ్చరికలు, తుఫాన్ల ముందస్తు అంచనాలు, విపత్తు నివారణ వ్యవస్థల నిర్వహణలు, భూకంపాల తీవ్రత హెచ్చరికలు, పరిశోధనల్లో ముందడుగులు, సమాచార గణాంకాల విశ్లేషణలు, సముద్ర వైమానిక తోడ్పాట్లు, ప్రజా చైతన్యాలు నిరంతరం జరిగితేనే ప్రపంచ మానవాళి సురక్ష జరుగుతుందని తెలుసుకుందాం.